# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- క్యూ ఆర్ కోడ్‌తో కొత్త పాసు పుస్తకాల తయారీ జరుగుతోందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.
- రాజధాని రైతులకు చెల్లించాల్సిన కౌలు మొత్తాన్ని త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు న్యూఢిల్లీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నారు.
- రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

==================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి సచివాలయంలో ఈరోజు రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖలో ప్రస్తుత పరిస్థితులపై అధికారులని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల మదనపల్లెలో జరిగినటువంటి ఘటనలు పునరావృతం అవకుండా.. గత ఐదేళ్లలోతీసుకొచ్చిన చట్టాలు, సంస్కరణల పేరుతో అక్రమాలకు పాల్పడిన విధానాలపై తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షలో చర్చించామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సమీక్ష అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం భూసర్వే పేరిట ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. భూసర్వే ఇబ్బందులను గ్రామసభల్లోనే పరిష్కరించుకోవాలని, క్యూ ఆర్ కోడ్‌తో కొత్త పాసు పుస్తకాల తయారీ జరుగుతోందని మంత్రి వివరిస్తూ.....

(వాయిస్ 20 సెకన్లు)

==================

అమరావతిలోని రాజధాని గ్రామాల్లోని టిడ్కో ఇళ్లను పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2014-19 సంవత్సరాల మధ్య ప్రభుత్వ హయాంలో 5 లక్షల టిడ్కో ఇళ్లకు అనుమతి

ఇచ్చామన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద అనేక వసతులను ఏర్పాటు చేసి 2019 నాటికి 77 వేల 371 ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల సంఖ్యను 2.62 లక్షలకు కుదించారని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలను సైతం పట్టించుకోలేదన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వసతుల్ని మూడు నెలల్లో కల్పిస్తామని తెలిపారు. రాజధాని రైతులకు చెల్లించాల్సిన కౌలు మొత్తాన్ని త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు మధ్యాహ్నం న్యూఢిల్లీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) నిర్వహిస్తోన్న "వికసిత భారత్ వైపు ప్రయాణం" అనే కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఈ సదస్సు వికసిత భారత్ సాధించడంలో పరిశ్రమల పాత్రతో పాటూ... ప్రభుత్వ దూర దృష్టిని తెలియజేయడమే లక్ష్యంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, దౌత్య సంఘాలు, ప్రభుత్వ ప్రతినిధులు వెయ్యి మందికి పైగా ప్రత్యక్షంగానూ, విదేశాలలో ఉన్న మరికొంతమంది వివిధ CII కేంద్రాల నుండి పరోక్షంగానూ హాజరవనున్నారు.

= = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈరోజు ఆయన అనంతపురంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో 48 శాతం బోధన సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే నియామకాలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలో ప్రజలకు అందించాల్సిన చికిత్సపై వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

విశాఖ జిల్లాలోని పింఛను దారులందరికీ ఆగస్టు 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఈరోజు ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో పట్టణ ప్రాంతం ఎక్కువగా ఉన్నందున యుసీడీ, డీఆర్డీఏ సంయుక్తంగా పింఛన్లు పంపిణీని చేపట్టాలన్నారు. ఇదిలా ఉండగా ఏపిఈపిడీసీఎల్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈరోజు "ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన" కరపత్రం, గోడపత్రికను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామ మూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాజమహేంద్రవరం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి ఈరోజు మధ్యాహ్నం 3 గంటల సమయానికి 15 అడుగులకు నీటి మట్టం చర్యగా బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. జలవనరుల శాఖ అధికారులు 14 లక్షల 86 వేల 463 క్యూసెక్కుల వరద నీటిని 175 గేట్లు పైకి ఎత్తి సముద్రంలోకి విడుదల చేశారు. మరోవైపు కోనసీమ జిల్లాలో లంక గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = =

ముంపు ప్రాంతాల్లో పునరావాస, గణన ప్రక్రియలో మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పంట నష్టాలను, ఇతర నష్టాల గణనను వేగవంతం చెయ్యాల్సి ఉందన్నారు. వాటి

వివరాలను రెవిన్యూ డివిజన్ అధికారి ధృవీకరించాలని అన్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లు, గండి పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గ్రామస్థాయి సిబ్బంది ముందుగా గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ముంపు ప్రాంతాలన్నీ సందర్శించి పంట నష్టపరిహారాన్ని కౌలు రైతుల వారీగా సేకరిస్తున్నామని వ్యవసాయ అధికారులు కలెక్టర్ కు వివరించారు.

= = = = = = = = = = = = = = = = = =

ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో ఈరోజు జల వనరుల శాఖ అధికారులు మూడు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 878.40 అడుగులుగా ఉంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 179.89 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. వరద ప్రవాహం భారీగా ఉండడంతో మూడు గేట్లను ఎత్తిన అధికారులు.. ఒక్కో గేటు నుంచి 27 వేల క్యూసెక్కులను విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. అలాగే కొన్ని చోట్ల బలమైన గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాకాశముందని వాతావరణ అధికారి తెలియజేస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ఏలూరు జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జిల్లాలో ఉచిత ఇసుక విధానంపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ... జిల్లాలో ఉచిత ఇసుక విధానం పూర్తి పారదర్శకతతో అమలు కావాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద 24 గంటలూ పని చేసేవిధంగా సి.సి. కెమెరాలు, సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని, సిబ్బందిని మూడు షిప్టులలో నియమించాలని, స్టాక్ పాయింట్ లో ప్రతీరోజు ఉదయం ప్రారంభం నిల్వ, ఆరోజు సరఫరా చేసినది, నిల్వ వివరాలతో రికార్డులు నిర్వహించాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలు తప్పనిసరిగా ప్రదర్శించాలని, నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = =

అంకుర పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే పటిష్టమైన వ్యాపార ప్రణాళికలు, మార్కెట్ వ్యూహాలను కలిగి ఉండాలని విశాఖపట్నం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సమీమ్ జావేద్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని (NIT) ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్. మూర్తి ఆధ్వర్యంలో "ఏంజెల్ ఇన్వెస్ట్ మెంట్ వీసీ ఫండింగ్ ఆపర్చ్యునిటీ" అనే అంశంపై ఈరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సమీమ్ జావేద్ మాట్లాడుతూ... కంపెనీలు అభివృద్ధి చెందడానికి, భవిష్యత్తులో విస్తరించడానికి ఈ పెట్టుబడులు ఎంతో కీలకమని, మంచి ఆలోచనలతో ముందుకొచ్చే ఔత్సాహికులను కంపెనీలు ఏర్పాటు చేసే దిశగా ప్రోత్సహించేందుకు ఏంజెల్ ఇన్వెస్టర్లు ముందుకు వస్తారని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = =

విద్యాలయాల అభివృద్ధికి స్థానికుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఒంగోలు బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ కుమారి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి 4 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నిర్వహిస్తున్న "శిక్షా సప్తాహ్" కార్యక్రమంలో భాగంగా ఈరోజు "శుభ దిన్ భోజన్" కార్యక్రమాన్ని నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = =